క్లుప్తంగా

జోనల్‌స్థాయి కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

వేలేరు : మండల కేంద్రంతో పాటు ధర్మసాగర్ మండలాల జోనల్‌స్థాయి కబడ్డీ క్రీడాకారుల ఎంపికలను స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో చేపట్టినట్లు ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సద్దాంహుస్సేన్ శనివారం తెలిపారు. వేలేరు, ధర్మసాగర్ మండలాల జోనల్‌స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు ఆదివారం భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్ గ్రామ పంచాయతీ క్రీడా మైదానంలో క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు సెప్టెంబర్ 25 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనున్నట్లు తెలిపారు.

మోదీ జన్మదిన వేడుకలను జయప్రదం చేయాలి



పరకాల : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదిన వేడుకల సందర్భంగా 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవా పక్షం పేరుతో నిర్వహించనున్న సామాజిక సేవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కార్యకర్తల సమావేశంలో ఆయన కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. పట్టణ అధ్యక్షుడు నిరంజన్, రాష్ట్ర నాయకుడు మేఘనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్‌లాల్, సేవా పక్వాడ పరకాల కన్వీనర్ రాజేందర్ ఉన్నారు.

మనీష సోదరుడికి న్యాయం చేయాలి

- అంత్యక్రియలను అడ్డుకున్న బంధువులు, గ్రామస్తులు



వేలేరు : మండలంలోని పీచర గ్రామంలో మనీష(18) శుక్రవారం అనుమానస్పదంగా మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా మనీష సోదరుడు కుమారస్వామికి న్యాయం చేయాలని గ్రామస్తులు, బంధువులు ఆందోళనకు దిగారు. మనీషా తండ్రి శివరాత్రి రాజు పేరున ఉన్న భూమిని కుమారస్వామి పేరున రిజిస్ట్రేషన్ చేయాలని మృతురాలి మేనమామ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అంత్యక్రియల కోసం పీచర గ్రామానికి తీసుకురాగా భీమదేవరపల్లి మండలం కొప్పూర్‌కు చెందిన మృతురాలి అమ్మమ్మ తరుపున బంధువులు, మేనమామ, పీచర గ్రామస్తులు అంత్యక్రియలను అడ్డుకుని ఆందోళన చేపట్టారు. అనంతరం మృతురాలి బంధువులు మాట్లాడుతూ.. మనీషను తండ్రి రాజు, సవతి తల్లి కలిసి ఉరేసి చంపారని, మృతురాలి తమ్ముడు కుమారస్వామిని కూడా ఇలాగే చంపుతారని ఆరోపించారు. కుమారస్వామికి తండ్రి, సవతి తల్లితో ప్రాణపాయం ఉందని, ఇలా కాకుండా ఉండాలంలే రాజు పేరున ఉన్న పట్టా భూమిని కుమారస్వామి పేరున రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీరికి మద్దతుగా గ్రామస్తులు కూడా ఆందోళనలో పాగ్గొన్నారు. ధర్మసాగర్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై సురేష్ అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి కుమారస్వామికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

వైద్యులను నియమించాలి

కాజీపేట: ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు సరైన వైద్య సేవలను అందించడం కోసం ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్‌లో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. కాజీపేట పట్టణంలో తెలంగాణ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ వెల్‌నెస్ సెంటర్‌లో నిపుణులైన వైద్యులు లేనికారణంగా సరైన వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే మంజూరు చేయాలని, వైద్య నిపుణులను నియమించాలని సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేసి ఆమోదించారు.

గురుకులంలో మిలాద్ ఉన్ నబీ

న్యూశాయంపేట: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని హనుమకొండ కేయూ క్రాస్‌రోడ్డులోని వరంగల్(జీ1) బాలికల గురుకులంలో శనివారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకల్లో మైనార్టీ ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ డాక్టర్ అనీస్ సిద్ధిఖీ పాల్గొని మహ్మద్ ప్రవక్త జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. గురుకులాల రీజినల్ లెవల్ కోఆర్డినేటర్ డాక్టర్ సతీష్, విజిలెన్స్ అధికారులు అక్బర్, మక్బూల్‌పాషా, అకడమిక్ కోఆర్డినేటర్ రుహీనా, తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో దొంగల హల్‌చల్

- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- పశువులు, వ్యవసాయ పనిముట్లను వదలని దుండగులు
- ఖాకీలకు తలనొప్పిగా మారిన వరుస ఘటనలు



సీసీ కెమెరాలో రికార్డు అయిన అనుమానాస్పద వ్యక్తి ఫొటో

వేలేరు : మండలంలో ఇటీవల వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగలు తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేస్తున్నారు. దీంతో స్థానికులు పొరుగూరికి, కూలికి వెళ్లేందుకు ఇంటికి తాళం వేయాలంటే జంకుతున్నారు. వ్యవసాయ బావుల వద్ద ఉన్న పశువులు, వ్యవసాయ పనిముట్లు, పాకాల్లో కట్టేసే మేకలు, గొర్రెలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉండే కాపర్ వైర్లను సైతం దొంగలు వదలడం లేదు. ఇంటికి ఖరీదైన తాళం వేస్తున్నా వాటిని ధ్వంసం చేసి చొరబడుతున్నారు. దానికి తోడు మండలంలోని కొన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడం దొంగలకు మరింత కలిసివస్తుందని పలువురు వాపోతున్నారు. గతంలో పోలీసులు దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటి నిర్వహణను గ్రామ పంచాయతీలకు అప్పగించారు. కానీ కొంత మంది పంచాయతీ అధికారులు సీసీ కెమెరాల నిర్వహణను గాలికొదిలేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. మరికొన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల తీగలను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. దీంతో దొంగలు అదే అదునుగా భావించి చోరీలకు పాల్పడుతున్నారు.

ఒకేరోజు మూడు ఇళ్లల్లో చోరీ...

ఈనెల 10న బుధవారం రాత్రి మండలంలోని షోడాషపల్లి గ్రామంలో రెండు ఇళ్లల్లో, మల్లికుదుర్ల గ్రామంలో ఓ ఇంట్లో దొంగలు ఇంటి తలుపులు, కిటికీలు ధ్వంసం చేసి ఇంట్లోలోని నగలు, డబ్బులు, ఇతర విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారు. దీంతో ఒకే రోజు మూడు ఇళ్లల్లో చోరీ జరగడంతో వారిని పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఫింగర్ ప్రింట్ నిపుణులను పిలిపించి ఆధారాలు సేకరించారు. అలాగే



మల్లికుదుర్ల గ్రామంలో బీరువా ధ్వంసం చేసిన దొంగలు (ఫైల్)

ఆయా గ్రామాల్లో సీసీ ఫుటేజీని కూడా పరిశీలించారు. మండలంలోని బండతండా, షోడాషపల్లి గ్రామాల్లోని వాటర్ ట్యాంకర్ టైర్లు దొంగలించగా చోరీకి పాల్పడిన వారిని ఇప్పటికీ గుర్తించకపోవడంతో అధికారులపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మల్లికుదుర్ల, షోడాషపల్లి గ్రామాల్లో కొంత కాలంగా దొంగలు పశువులు, మేకలు, గొర్రెలు, ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్‌ను అపహరిస్తుండటంతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. చోరీకి పాలప్పడిన దొంగలు ఎలాంటి ఆధారాలు దొరకుండా, సీసీ కెమెరాలకు చిక్కకుండా జాగ్రత్త పడుతున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా పోలీసులు 24 గంటలు నిఘా ఉంచి పెట్రోలింగ్ చేస్తూ దొంగతనాలను నియంత్రిచాలని మండల ప్రజలు కోరుతున్నారు. కాగా మండలంలో దొంగల భయందో ప్రజలు హడలెత్తిపోతున్నారు.

త్వరలోనే పట్టుకుంటాం



మండలంలో చోరీలకు పాలప్పడుతున్న దొంగలను త్వరలోనే పట్టుకుంటాం. చోరీలు జరగకుండా 24 గంటల పాటు పోలీస్ సిబ్బందితో పాటు రాత్రి సమయాల్లో నేను కూడా పెట్రోలింగ్ చేస్తున్నాను. దొంగలను పట్టుకునేందుకు ఆయా గ్రామాల్లోని సీసీ కెమెరాల ద్వారా సమాచారం సేకరించాం. గ్రామాల్లో ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలి.

- అజ్మీర సురేష్, వేలేరు ఎస్సై

ఎన్‌ఎస్‌ఎస్ శిక్షణతో విలువల పెంపు

- ప్రొఫెసర్ నారాయణ



మాట్లాడుతున్న నారాయణ

ధర్మసాగర్ : ఎన్‌ఎస్‌ఎస్ శిక్షణతో విద్యార్థులకు సామాజిక విలువలు పెంపొందుతాయని ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్, ప్రొఫెసర్ నారాయణ అన్నారు. మండలంలోని ఉనికిచర్ల గ్రామంలో శనివారం హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (అటానమస్) ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో వారంరోజుల పాటు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్, ప్రొఫెసర్ చంద్రమౌళి అధ్యక్షత వహించగా ఆయన హాజరై మాట్లాడారు. యువతలో సామాజిక సేవ, బాధ్యత, దేశభక్తి పెంపొందించేందుకు ఎన్‌ఎస్‌ఎస్ తోడ్పడుతుందన్నారు. విద్యార్థుల్లో దాగివున్న కళలను, సేవాభావాన్ని వెలికి తీసేందుకు వ్యక్తిత్వ వికాసానికి నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఎన్‌ఎస్‌ఎస్ చక్కని వేదిక అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు గ్రామాలను క్లీన్ అండ్ గ్రీన్‌గా మారుస్తున్నట్లు చెప్పారు. అనంతరం వలంటీర్లు శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి కవిత, రమా రత్నమాల, డాక్టర్ మమత, 50 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

'కుడా' పరిధిలోని రైతులకు న్యాయం చేయాలి

- ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ సురేష్



మాట్లాడుతున్న మాదాసి సురేష్

కమలాపూర్ : సాదాబైనామాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 106ను సవరించి కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా)తో పాటు హెచ్‌ఎండీఏ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలోని విలీన గ్రామాల రైతులకు సాదాబైనామాల రెగ్యులరైజేషన్ వర్తింపజేయాలని ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. మండలంలోని గూనిపర్తిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాదాబైనామా, అన్ రిజిస్టర్డ్ డాక్యుమెంట్ల ద్వారా కొనుగోలు చేసిన పేదలతో పాటు చిన్న, సన్నకారు రైతులకు చెందిన భూములను క్రమబద్ధీకరించడానికి భూ భారతి చట్టాన్ని అనుసరించి ప్రభుత్వం 106 జీఓ తీసుకురావడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కానీ ఈ జీఓలో రకరకాల నిబంధనలు పొందు పరిచి అర్హులైన రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన 106 జీఓను సవరించి రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండా ఉచితంగా పేదల భూములు క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. గతంలో దరఖాస్తు చేసుకోని రైతులకు, అసైన్డ్ రైతులకు కూడా అవకాశం కల్పించి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. లేని పక్షంలో రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, దళిత, సామాజిక సంఘాల ఆధ్వర్యంలో పెద్దెత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ప్రజా సంఘాల నాయకులు ఐలయ్య, సారయ్య, అంకూస్, శ్రీలత, సామ్యేల్, తేజేశ్వర్, కాంత, రవి, రవీందర్, కవిత, రాజేందర్, సారయ్య, నాగరాజు, కోమల, శైలజ పాల్గొన్నారు.

గొర్రెల కాపరులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

- జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు రమేశ్



కమలాపూర్ : సర్వే చేస్తున్న రమేశ్

కమలాపూర్ : గొర్రెలు, మేకల పెంపకందారులు ప్రమాదశాత్తు మరణిస్తే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి బాధిత కుటుంబానికి అందించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమలాపూర్, దేశరాజుపల్లి గ్రామాల్లో గొర్రెల కాపరులు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొర్రెలు, మేకలకు వస్తున్న వివిధ రకాల రోగాలకు మందులు ఉచితంగా పంపిణీ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గొర్రెలు, మేకలపై ఆధారపడి జీవిస్తున్న కాపర్లు ప్రైవేట్‌గా మందులు కొనుగోలు చేయలేక ఆర్థిక కష్టాలు ఎదుర్కొటున్నారని అన్నారు. గత ప్రభుత్వం గొర్రెల కాపరులను మోసం చేసిందని, ఈ ప్రభుత్వం కూడా గొల్ల, కురుమలను విస్మరిస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి లింగయ్య, మండల కార్యదర్శి రవీందర్, గొర్రెల కాపర్లు కుమారస్వామి, శ్రీనివాస్, రాజయ్య, కిషన్, కొమురయ్య, భిక్షపతి, చేరాలు పాల్గొన్నారు.

నడికూడలో..

నడికూడ : జీవాలకు నట్టల నివారణ మందును ఉచితంగా పంపిణీ చేయాలని గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం హనమకొండ జిల్లా కార్యదర్శి కాడబోయిన లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ధర్మారం, నడికూడ గ్రామాల్లో గొర్రెల, మేకల పెంపకందారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించారు. వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

పరకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపుల్లో మిగిలిన సీట్లకు 15, 16న స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోశ్‌కుమార్, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఒరిజినల్, జిరాక్స్ పత్రాలతో దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని తెలిపారు. స్థానిక అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉంటుందని వారు లేనిపక్షంలో స్థానికేతరులకు అవకాశం ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు దోస్త్ టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ సంజయ్‌కుమార్ 9573956412 ను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి



హైవే రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు : జాతీయ రహదారి (163)పై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని సీఐ సంతోశ్ హైవే అధికారులను కోరారు. ఇటీవల మండలంలోని గూడెప్పాడ్ సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందగా సంఘటన స్థలాన్ని శనివారం వివిధ శాఖల అధికారులు పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఈ మార్గంలో సూచిక బోర్డులు, సోలార్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ రమేశ్‌నాయక్, రోడ్డు సేఫ్టీ అధికారి శ్రీనివాస్, హైవే ఏఈ చేతన్, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మానవ సంబంధాలను రక్షించుకోవాలి

- ప్రముఖ రీడర్, టీచర్ సుమిత్రాదేవి



మాట్లాడుతున్న సుమిత్రాదేవి

ఎల్కతుర్తి : నేటి ఆధునిక సమాజంలో మానవ సంబంధాలను పరిరక్షించుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని ప్రముఖ రీడర్ సుమిత్రాదేవి అన్నారు. శనివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని ఏకేవీఆర్ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే జరిగింది. ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవిష్యత్ స్వప్నమనే పేరుతో విద్యార్థులకు సుమిత్రాదేవి సృజనాత్మకమైన సందేశాన్ని అందించారు. మనిషి జీవితం ఒక ప్రవాహమని, మానవ సంబంధాల విలువ తెలుసుకున్నప్పుడు మనిషి భవిష్యత్ తెలుస్తుందన్నారు. విద్యార్థి దశనుంచే ప్రతీ ఒక్కరూ పాజిటివ్ ఆలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ నరసింహారెడ్డి, కళాశాల కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీకాంత్ అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కళా ఉత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికెట్లతో విద్యార్థులు, ఉపాధ్యాయినులు

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ రజని తెలిపారు. త్రీడి విజ్యువల్ ఆర్ట్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థిని శ్రీహిత, ట్రెడిషినల్ స్టోరీ టెల్లింగ్‌లో 9వ తరగతి విద్యార్థినులు శ్రీనిధి, మనిషా ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కళా ఉత్సవాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈఓ భిక్షపతి, ప్రిన్సిపాల్ రజని, గైడ్ ఉపాధ్యాయురాలు ఉమారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులకు సర్టి ఫికెట్లు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత



గుడుంబాతో పట్టుబడిన వ్యక్తితో పోలీసులు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో 20 లీటర్ల గుడుంబా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకోడెపాకలో సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన పాలకుర్తి సారయ్య ఇంటి వద్ద గుడుంబా విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో అతడి ఇంటిపై దాడులు నిర్వహించగా గుడుంబా విక్రయిస్తూ కనిపించినట్లు తెలిపారు. వెంటనే పంచుల సమక్షంలో 20లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని సారయ్యను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గంగిరేణిగూడెంలో..



రేగొండ: అక్రమంగా గుడుంబా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు కొత్తపల్లిగోరి ఎస్సై దివ్య తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం గంగిరేణి గూడెం తండాకు చెందిన మాలోతు నరహన్ ద్విచక్ర వాహనంపై 20 లీటర్ల గుడుంబాను తరలిస్తుండగా నిజాంపల్లి శివారులో గుడుంబా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'తహసీల్' ముట్టడికి తరలిరావాలి



పింఛన్‌దారులతో మాట్లాడుతున్న రవీందర్

కమలాపూర్ : దివ్యాంగులు, వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలు, చేనేత, గీత, బీడీ కార్మికుల పింఛన్ల పెంపు కోసం ఈనెల 15వ తేదీన నిర్వహించతలపెట్టిన తహసీల్దార్ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా కార్యదర్శి, కమలాపూర్ మండల ఇన్‌చార్జ్ శనిగరపు రవీందర్ పింఛన్‌దారులకు పిలుపునిచ్చారు. మండలంలోని దేశరాజుపల్లిలో వీహెచ్‌పీఎస్ మండల ఉపాధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో పింఛన్‌దారులతో శనివారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.4 వేలుగా ఉన్న దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు, రూ.2 వేలుగా ఉన్న వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలు, చేనేత, గీత, బీడీ కార్మికుల పింఛన్‌ను రూ.4 వేలకు పెంచుతామని నేతలు చెప్పి 21 నెలలు గడుస్తున్నా హామీ నెరవేరలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే పింఛన్లు పెంచి ఇవ్వాలని, పూర్తిస్థాయిలో కండరాలు క్షీణించిన వారికి రూ.15 వేల ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమలాపూర్ తహసీల్దార్ కార్యాలయ ముట్టడికి దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత, బీడీ కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

సంక్షిప్తంగా

దుర్గాదేవి నవరాత్రి ఉత్సవ కమిటీ ఎన్నిక

ఎల్కతుర్తి : ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 24 సంవత్సరాలుగా ఏర్పాటు చేస్తున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవ కమిటీని శనివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు మాదుగుల ఈశ్వరయ్య తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా మాదుగుల నరేందర్, ప్రధాన కార్యదర్శిగా దాట్ల రాజు, ఉపాధ్యక్షుడిగా బోయిన శ్రీనివాస్, కోశాధికారిగా బొల్లంపల్లి రాజమౌళిని ఏకగ్రీంగా ఎన్నుకున్నటుపేర్కొన్నారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు దాతలు సహకరించాలని కోరారు. కార్యవర్గ సభ్యులు రమేశ్, అశోక్, ప్రేమ్‌రాజ్, మంకయ్య, ధర్మేందర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మాణిక్యాపూర్‌లో వైద్యశిబిరం



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం వంగర ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం మాణిక్యాపూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు డాక్టర్ రుబీనా తెలిపారు. డాక్టర్ రెహమాన్ గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమకాటు బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించామన్నారు. సూపర్ వైజర్ మోహన్, సిబ్బంది రఫత్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరకాల : మండలంలోని వెల్లంపల్లిలో గల జైభీమ్ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణులు విశ్వంత్‌రెడ్డి, బాపురావు, జైభీమ్ యూత్ సొసైటీ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, ఇన్‌చార్జ్ శరత్‌చంద్ర, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంజేపీలో ఘనంగా హిందీ దివస్



ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం హిందీ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలు అక్తర్‌ఫాతిమాను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించగా ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ అనిత పాల్గొన్నారు.

మత్తడిరోడ్డుపై గుంతల పూడ్చివేత

ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్ చెరువు మత్తడి రోడ్డుపై ట్రాఫిక్ జామ్ కాగా శనివారం సీఐ సంతోశ్ మత్తడి వద్దకు చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఆ తర్వాత మత్తడిపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చివేయించారు. దీంతో స్థానికులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

బస్టాండ్‌ను పరిశీలించిన డీఎం



స్థానికులతో మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం రాంప్రసాద్

శాయంపేట : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, పరిసరా ప్రాంతాన్ని శనివారం పరకాల ఆర్టీసీ డిపో మేనేజర్ రాంప్రసాద్ పరిశీలించారు. శాయంపేటకు బస్సు సౌకర్యం లేదని, వెంటనే కల్పించాలని స్థానికుడు రామన్న కోరారు. మాందారిపేట స్టేజి వద్ద బస్సులు నిలపడం లేదని, రాత్రి సమయంలో బస్టాండ్ వద్ద బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తుందని, పరకాల నుంచి హనుమకొండ వెళ్లే బస్సులు శాయంపేటకు మళ్లించే విధంగా చూడాలని కోరారు. స్పందించిన డీఎం మాందారిపేట వద్ద బస్సులు నిలిపే విధంగా చర్యలు తీసుకుంటామని, బస్టాండ్‌కు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. పరకాల నుంచి హనుమకొండకు వెళ్లే బస్సులను శాయంపేటకు మళ్లించే విధంగా ప్రయత్నం చేస్తానని చెప్పారు. బస్టాండ్‌లో ఉన్న రెండు గదులకు టెండర్ వేస్తున్నామని, గదులు తీసుకున్నవారికి విద్యుత్ సౌకర్యంతో పాటు లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

బొడ్డెమ్మ ఆటపాటలతో సందడి



హన్మకొండ కల్చరల్: బొడ్డెమ్మ పండుగలో భాగంగా రెండో రోజు హనుమకొండ చీకటివాడలోని మహిళలు, యువతులు ఆటపాటలతో శనివారం సందడి చేశారు. అనేక దశాబ్దాలుగా కలిసి మెలసి బొడ్డెమ్మను ఏర్పాటు చేసుకుని తొమ్మిది రోజులపాటు ప్రతిరోజు పూలతో అలంకరించి పండుగ జరుపుకుంటున్నట్లు కాలనీ మహిళలు తెలిపారు.